## రైతు బీమాను సద్వినియోగం చేసుకోవాలి


పంటలను పరిశీలిస్తున్న మండల అధికారి

వేంసూరు, జూలై 22: రైతు బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి రామ్మోహన్ తెలిపారు. మండలంలోని గ్రామాల్లో సాగు చేసిన పంటలను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వ్యవసాయ శాఖ 2018 నుంచి ప్రతిష్ఠాత్మకంగా రైతు బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఇప్పటి వరకు మండలంలో 22 మంది రైతు కుటుంబాలకు రూ.10.10 కోట్లు రైతుబీమా సొమ్ము అందించినట్లు పేర్కొన్నారు. కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకం పొందిన రైతులు ఆగస్టు 5వ తేదీ లోపు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండలంలో కొత్త, పాత పట్టాదారు పాస్ పుస్తకం కలిగిన మొత్తం 1,751 మంది రైతులు ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోలేదని, రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సత్తుపల్లి, సత్తుపల్లి టౌన్, జూలై 22: త్వరితగతిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తిచేసి విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలని మున్సిపల్ చైర్మన్ కూసంపుడి మహేశ్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల రోడ్డు పనులను శనివారం ప్రారంభించి మాట్లాడారు. కళాశాల లోపలి వరకు ఉన్న మట్టి రోడ్డు వర్షాకాలంలో విద్యార్థినులు నడవడానికి అసౌకర్యంగా ఉంది. ఈ విషయాన్ని గతంలో విద్యార్థులు ఎమ్మెల్యే సండ్ర దృష్టికి తీసుకెళ్లారు. ఆయన విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి రూ.5 లక్షలు సీసీ రోడ్డు నిర్మాణానికి మంజూరు చేశారు. ఆయన వెంట కమిషనర్ సుజాత తదితరులు ఉన్నారు.


పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ కూసంపూడి

## నేడు హెటిరో ఆధ్వర్యంలో జాబ్ మేళా

సత్తుపల్లి రూరల్, జూలై 22 : మండల పరిధిలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం హెటిరో ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు హెటిరో హెచ్‌ఆర్ జయపాల్‌రెడ్డి, కళాశాల సెక్రటరీ దాసరి ప్రభాకర్‌రెడ్డి శనివారం తెలిపారు. రాజ్యసభ సభ్యుడు, హెటిరో డ్రగ్స్ అధినేత బండి పార్థసారథిరెడ్డి ఆలోచన మేరకు గ్రామీణ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ మెగా జాబ్‌మేళాను ఉదయం 10 నుంచి 4 గంటల వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఐటీఐ, డిప్లొమో, బీఎస్సీ, బీకాం, బీఏ, ఎమ్మెస్సీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ, బీటెక్(ఈఈఈ, మెకానికల్) చదివిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## పంటల నమోదు చేయించుకోవాలి

కామేపల్లి, జూలై 22 : వానకాలంలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏవో తారాదేవి అన్నారు. మండలంలోని కొమ్మినేపల్లి, కొండాయిగూడెం రెవెన్యూ పరిధిలో రైతులు సాగు చేసిన పంటలను శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రాల్లో పంటలను విక్రయించాలంటే పంటల సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు తప్పనిసరి అన్నారు. రైతుబీమా పథకానికి అర్హులైన రైతులు దరఖాస్తు ఫారంతో పాటు సంబంధిత పత్రాలను ఏఈవోలకు అందించాలని అన్నారు.

## టీబీ నిర్మూలన ప్రతిఒక్కరి బాధ్యత


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

తల్లాడ, జూలై 22: రామానుజవరం గ్రామాన్ని డాక్టర్ అల్తాఫ్ శనివారం సందర్శించి ప్రజల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ అల్తాఫ్, టీబీ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ సురేశ్ మాట్లాడుతూ టీబీ గురించి ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, టీబీపై అపోహలు వీడాలని సూచించారు. తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 57 రకాల పరీక్షలు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్త సరస్వతి పాల్గొన్నారు.

## నాట్లు వేసేందుకు పొలాలు సిద్ధం


పొలంలో దమ్ము చేస్తున్న రైతు

పెనుబల్లి, జూలై 22: వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రైతులు నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. గతం కంటే భిన్నంగా వెదజల్లే పద్ధతిని ఎక్కువ శాతం ఉపయోగించినప్పటికీ బోర్లు ఆధారం ఉన్న రైతులు నారు పోశారు. శనివారం నుంచి మండల వ్యాప్తంగా వరినాట్లు ముమ్మరం చేశారు.

# నర్సరీల నుంచి మొక్కల తరలింపు

పెనుబల్లి, జూలై 22: హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలను గ్రామాల్లో పంపిణీ చేయాలని ప్రభుత్వం ఏర్పాటు చేసిన నర్సరీల్లో ఆయా గ్రామపంచాయతీలకు ట్రాక్టర్లతో తరలించారు. తాళ్లపెంట నర్సరీలో పలు రకాల ఏపుగా పెరిగిన మొక్కలను పంచాయతీలకు, అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్లాంటింగ్‌లో మొక్కలను నాటేందుకు అటు అటవీ సిబ్బంది, ఇటు పంచాయతీ సిబ్బంది మొక్కలను తరలిస్తున్నారు. వర్షాలకు భూమి మెత్తబడడంతో త్వరితగతిన మొక్కలు వేసే అదును ప్రకారం మొక్కలు ఎదుగుతాయని అటవీశాఖ సిబ్బంది కూలీలతో మొక్కలు నాటుతున్నారు. గ్రామ పంచాయతీల్లో చనిపోయిన మొక్కల స్థానంలో కూలీలచే కొత్త మొక్కలు నాటిస్తున్నారు.


తాళ్లపెంటలో మొక్కలను ట్రాక్టర్‌లోకి వేస్తున్న కూలీలు

### ఈజీఎస్ ద్వారా పండ్ల తోటల పెంపకాలు

సత్తుపల్లిరూరల్, సత్తుపల్లి టౌన్, జూలై 22: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా 2023-24లో పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో సుభాషిణి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ చిన్నకారు రైతులు అయి ఉండి 5 ఎకరాల లోపు పట్టాదారు రైతులు జాబ్‌కార్డు కలిగి ఉన్న వారు పథకానికి అర్హులన్నారు. రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంకు అకౌంట్ జిరాక్స్, ఆధార్‌కార్డు, ఉపాధిహామీ జాబ్‌కార్డులు, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో గ్రామపంచాయతీ తీర్మానం తీసుకొని గ్రామపంచాయతీ సెక్రటరీ లేదా ఈజీఎస్ ఏపీవోకు సమర్పించాలన్నారు. మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, మునగ, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్, సపోటా, ఆయిల్‌పాం, బత్తాయి, అలనేరేడు మొక్కలు పెంచేందుకు ఈ పథకానికి అర్హులన్నారు. తోటలు పెంచుకునేందుకు గుంతలు తీసేందుకు, మొక్కలు నాటేందుకు ఉపాధిహామీ నుంచి నిధులు కేటాయిస్తామని, ఈ నెలాఖరు కల్లా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ఎమ్మెల్యే సండ్రపై తప్పుడు విమర్శలు సహించం

**- మండల మాదిగ సమాఖ్య**

కల్లూరు, జూలై 22 : సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యపై సోషల్ మీడియా వేదికగా తప్పుడు విమర్శలు, అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేదిలేదని మండల మాదిగ సమాఖ్య నాయకులు హెచ్చరించారు. శనివారం కల్లూరులో వారు విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కల్లూరు కేంద్రంగా ఎమ్మెల్యే సండ్రపై యూట్యూబ్ చానెల్, ఎన్జీవో ప్రైవేటు సంఘాల పేరుతో ఉద్దేశపూర్వకంగా తప్పుడు కథనాలు సృష్టిస్తూ అసత్య ఆరోపణలు చేస్తున్నారని వారు ఆరోపించారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై గ్రామంలో ఎక్కడైనా చర్చకు పిలిస్తే తాము సిద్ధమని, ఆరోపణల్లో ఎలాంటి వాస్తవంలేదన్నారు.సమావేశంలో మాదిగ సమాఖ్య నాయకులు కొరకొప్పు ప్రసాద్, బొక్కా వెంకటేశ్వర్లు, పరిగడుపు రాము, గొల్లమందల ప్రసాద్, నందిగం ప్రసాద్, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, సింగిశాల ప్రసాద్, ఖమ్మంపాటి పుల్లారావు, ఖమ్మంపాటి రమేష్, కువ్వారపు విజయరావు, మోదుగు వీరయ్య, నాగేశ్వరరావు, జొన్నలగడ్డ నవీన్, మల్లాది బసవయ్య, తేళ్లూరి భాస్కరరావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దళితసంఘం నాయకులు

# పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

వేంసూరు, జూలై 22: పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని, గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణను చేపట్టాలని ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు సూచించారు. దుద్దేపూడి గ్రామంలో పారిశుధ్య పనులు, సైడ్‌డ్రైనేజీలను శనివారం పరిశీలించి మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకునేలాగా ప్రజలకు అవగాహన కల్పించాలని, వర్షాకాలం నేపథ్యంలో వీధుల వెంట, ఇళ్ల మధ్యలో మురుగు నిల్వ లేకుండా చూడాలని తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరా, స్తంభాల వద్ద ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమం లో ఎంపీవో రంజిత్‌కుమార్, కార్యదర్శి శిరీష పాల్గొన్నారు.


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ

కామేపల్లి, జూలై 22 : ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ముచ్చర్ల సర్పంచ్ జాటోత్ జాయిలూసీ అన్నారు. గ్రామంలోని వీధుల వెంట పిచ్చి మొక్కల నివారణకు కలుపు మందును శనివారం పిచికారీ చేయించి మాట్లాడుతూ వానకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాన్ని శుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని, చెత్తాచెదారాన్ని వీధులవెంట వేయకూడదని సూచించారు.

# గ్రంథాలయంలో దాశరథి జయంతి

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 22 : నగరంలోని జిల్లా గ్రంథాలయంలో దాశరథి కృష్ణమాచార్య జయంతి వేడుకలు నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. తెలంగాణ సాహిత్యంలో దాశరథి చేసిన కృషి మరువలేనిదని ఆయన సేవలను కొనియాడారు. నాడు నిజాం పాలనకు వ్యతిరేకంగా కవితలు రాశారని అన్నారు. కార్యక్రమంలో అర్జున్, భాస్కర్, కనకపల్లి, విజయకుమారి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.


దాశరథి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉద్యోగులు

# పీహెచ్‌సీలో కేసీఆర్ కిట్ పంపిణీ

కారేపల్లి, జూలై 22 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రసవించిన మహిళకు వైద్య సిబ్బంది కేసీఆర్ కిట్ పంపిణీ చేశారు.మండల వైద్యాధికారి సురేష్ మాట్లాడుతూ భీక్యాతండాకు చెందిన జి.సౌందర్య 2.05 కేజీల బరువున్న ఆడ శిశువుకు జన్మనిచ్చిందన్నారు. ఆమెకు శనివారం కేసీఆర్ కిట్‌ను అందజేశామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది విజయ కుమారి, ఉండం రాధ, గంగ, జయమ్మ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.


బాలింతకు కేసీఆర్ కిట్ అందిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది